**డిటెక్టివ్ కథ**

# ప్రేమ లేఖల్లో...

\- వింధ్యవాసిని

**అప్పుడే బెక్ పార్క్‌చేసి ఇంట్లోకి వస్తున్నాడు తుషార్. చెప్పుల షెల్ఫ్ దగ్గరున్న స్టూల్‌మీద కూర్చుని ఒకచేత్తో షూలేసులు విప్పుకుంటూ, మరో చేత్తో వీపుమీదున్న కిట్ బ్యాగును విప్పదీసుకుంటూ, అలవాటు ప్రకారం ''గౌతం వచ్చాడా మమ్మీ?'' అని అడిగాడు.**

**జానకమ్మ సమాధానమిచ్చేలోపల అక్కడ ఆమెతోబాటు ఇంకా ఎవరో అతిథి కూర్చుని ఉన్నట్లు అనిపించి ఇటు తిరిగాడు. అలవాటు ప్రకారం టీవీలో ఆవిడకు ఇష్టమయిన చానల్లో, ఇష్టమయిన సీరియల్ రావడం లేదు. నిజానికి అది ఆఫ్ అయి ఉంది.**

తుషార్ గమనించాడు కుందనం బొమ్మలాంటి ఒక అమ్మాయి, ఎవరో తనకు తెలియదు కానీ అక్కడ కూర్చుని వాళ్ళమ్మగారితో మాట్లాడుతోంది. ''తుషార్, ఈ అమ్మాయి పక్క ఇంట్లో కొత్తగా చేరిందిరా!'' అని చెప్తున్న జానకమ్మ ముఖంలోని సంతోషం అతని దృష్టిని దాటిపోలేదు. ఆ ఇంట్లో ఉన్న కుటుంబాలే ఆమెకు కాలక్షేపం. ఇంకొక వైపు ఇల్లు కూతవేటుకన్నా కాస్త దూరంగా ఉంటుంది. ఇంట్లో కూడా ఇద్దరు బాగా వయసు మళ్ళిన మగవాళ్ళిద్దరు, అన్నాతమ్ముళ్లు ఉంటారు. ఎప్పుడో ఉదయం ఒకసారి వాకింగ్ వెళ్ళినప్పుడు తప్ప ఇద్దరూ బయటికి రారు. కాస్త పెద్ద ఆవరణలు, తోటలు ఉన్న ఈ గృహసంకీర్ణం ఊరిక్కాస్త దూరంలో ఉంటుంది. ఇక్కడ ఇల్లు కట్టుకోవటంలో, వాహనాల శబ్దాలకు, అవిలేపే దుమ్ముకూ దూరంగా కొన్నేళ్లయినా ఉండొచ్చని తుషార్ నాన్నగారి ఉద్దేశ్యం! అందుకు జానకమ్మ ఆయన్ను తిట్టుకోని రోజుండదు. 'అడవిలో తెచ్చి పడేశారు!' అని.

''పేరు గంగ. సాఫ్ట్‌వేర్ ఇంజనీరుట!'' అడక్కుండానే ఆవిడ వివరాలన్నీ చెప్పటం అతనికి కాస్త అతిగా కనిపించింది. అదేదో ఆమెకోసం ఈవిడే గర్విస్తున్నట్టు కనిపించి చిరాకేసింది. తుషార్‌కు తెలుసు తను ఇంజనీరింగు కాకుండా, మాథమాటిక్స్‌లో ఎం.ఎస్సీ చెయ్యటం ఈవిడగ్గానీ, ఐదేళ్ళ క్రితం గుండెనొప్పితో మరణించిన రిటైర్డ్ మేజిస్ట్రేట్ తండ్రికి గానీ ఇష్టం లేదు. అందుకని ఇలాంటి సందర్భాల్లో దెప్పుతున్నట్లు కూడా కనిపిస్తుంది. అయినా ఏదీ ఎక్కువగా పట్టించుకునే అలవాటు లేదు తుషార్‌కు. దేన్నో దులిపేసుకుంటున్నవాడిలా ఒక్కసారి కళ్ళు మూసుకుని తెరిచి ఒక నిట్టూర్పు విడిచి తన గది వైపు నడిచాడు.

అతన్ని మధ్యలో ఆపి, ''రా తుషార్. ఇక్కడొచ్చి కూర్చో. గంగ నీ కోసమే కాచుకుని ఉంది. ఈ రోజే ఇంట్లో చేరింది. ఆఫీసుకు సెలవు పెట్టింది. మనతో మాట్లాడాలని తనే వచ్చింది. మీరిద్దరూ మాట్లాడుతూ ఉండండి. నేను కాఫీ చేసుకొస్తాను. ఆ.. అన్నట్లు గౌతం ఇంకా రాలేదురా..'' అని ఆవిడ అంటుండగానే గేటు దగ్గర చప్పుడయింది. బయటికి తొంగిచూస్తూ, ''రెండో బస్సులో వచ్చినట్లున్నాడు! మళ్ళీ బాస్కెట్‌బాలు ప్రాక్టీసు మొదలయిందేమో!'' తనలో తను అనుకుంటూ లోపలికెళ్ళింది జానకమ్మ.

మొదటిసారిగా గంగవైపు పరిశీలనగా చూశాడు తుషార్. లేత గోధుమ రంగుమీద మండే ఎరుపు రంగు ఎంబ్రాయిడరీ చేసి ఉన్న కమీజు మీద, అదే ఎరుపు రంగు మాచింగ్ దుపట్టా, సల్వార్ వేసుకుని ఉంది. ఆమె పచ్చని మేని ఛాయను, స్ఫురద్రూపాన్ని ఎత్తి చూపిస్తున్నట్లున్నాయి ఆమె దుస్తులు, చేసుకున్న లైట్ మేకప్. పెదవుల మీద చెరగని చిరునవ్వుతో తనతో స్నేహం చేయాలని అనుకుంటున్నట్లూ, సంభాషణలో పెట్టాలని చూస్తున్నట్లు అతనికి అనిపించింది. చిత్రమేమంటే అతడు ఆమె వైపు ఆకర్షించబడుతున్నా, మనసు మాత్రం తన గదిలో ఉంది. అక్కడ రోజూ ఈ టైములో ఎమ్.ఎస్.ఎన్ చాట్‌లో తనకు దొరికే రాణి దగ్గరుంది. ఆలస్యం చేస్తే తను వచ్చి చూసి వెళ్ళిపోతుందేమోనని భయం!

జానకమ్మ వంట గదిలోకెళ్ళే సరికి అప్పుడే తోటలో నీళ్ళు పోయడం ముగించిన పనిమనిషి వంట గదిలో అందరికీ టీ పెడుతోంది. టీతో పాటు ట్రేలో స్వీట్లు, కారప్పూస తీసుకొచ్చింది. ''ఓ... ఎందుకాంటీ మీరు స్వీట్లు పెడ్తున్నారు? నేను కొత్తగా వచ్చాను ఇంటికి. నేను తెచ్చిపెట్టాలి అందరికీ!'' అంది గంగ ముఖమాటపడుతూ, అంతవరకూ గంగ ప్రశ్నలకు జవాబిస్తూ కాలక్షేపం చేస్తున్న తుషార్ అమ్మ రాగానే మెల్లిగా లోపలికి జారుకున్నాడు.

గదిలో బట్టలు కూడా మార్చుకోకుండా, కంప్యూటర్ స్విచ్ నొక్కాడు. విండోస్ స్టార్ట్ అయి, మెసెంజర్ కనెక్ట్ అవుతుంటే చూస్తూ కూర్చున్నాడు. పది నిముషాలు చూసినా రాణి రాలేదు. మెయిల్ బాక్స్ తెరిచి చూసాడు. మధ్యాహ్నం ఎందుకు కలవలేదో కారణం వ్రాసి ఉంటుందేమోనని, ఊహు, అక్కడా నిరాశే ఎదురయింది. ఆమె తనకింకా సెల్‌ఫోను నంబరు ఇవ్వలేదు. కలిసినప్పుడు అన్ని వివరాలు తెలుస్తాయి అనుకున్నాడు.

***

ఒకసారి తమాషాగా అనానిమస్ (పేరు లేని) చాట్-రూం ఒక దాంట్లో మాట్లాడుతూ పరిచయమయింది రాణి. రాణి మాటలూ, జవాబులూ అతనిమీద అయస్కాంతంలా పని చేసాయి. త్వరలోనే ఇద్దరూ మెయిల్ చిరునామాలు ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకున్నారు. ఎప్పుడో తెలీకుండానే పేరులేని చాట్-రూములు వదిలేసి ఎమ్.ఎస్.ఎన్ మెసెంజర్‌లో సంభాషించడం ప్రారంభించారు. రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచీ రాత్రి పన్నెండు గంటల లోపల ఎప్పుడో ఒకసారి మాట్లాడుకోకపోతే ఇద్దరికీ తోచదు.

వారం రోజుల క్రితం సంభాషణ అతనికింకా గుర్తుంది. ఆరోజు రాత్రి భోంచేసి అమ్మ తమ్ముడు పడుకున్న తర్వాత కంప్యూటర్ ఆన్‌చేసి తను ఫ్రీగా ఉంటే, మెసెంజర్లో రమ్మని రాణికి మెయిల్ చేసాడు. మెయిల్ అలా వెళ్ళిన మరుక్షణం, 'లాగిన్' అయి 'హి' అని మొదలు పెట్టింది.

అప్పటికి అతనికి ఆమెను గురించి క్లుప్తంగా తెలుసు. ఆమెకు ఇతన్ని గురించి వివరంగా తెలుసు. రాణి అనేది ఒక రిఫరెన్స్‌లాగే కానీ అది ఆమె అసలు పేరుకాదని అతని అనుమానం. అందుకని ఆమె పనిచేసే కంపెనీ పేరు చెప్పినా అది కూడా నిజం కాదని అతనికి అనిపించింది. ఏం పని చేస్తారని అడగాలనిపించలేదు. ''డాడీ పోయారు పోయిన ఏడాదే. అమ్మా నేనూ, తమ్ముడూ మాత్రమే ఇంట్లో. తమ్ముడు స్కూల్లో చదువుతాడు'' అని అతను అన్నప్పుడు, ఆమె ''నేను అనాథను. అనాథాశ్రమంలో పెరిగాను'' అని చెప్పింది.

ఆరోజు ధైర్యం చేసి అడిగాడు, ''ఎప్పుడు కలుద్దాం? మిమ్మల్ని చూడాలి రాణి'' అన్నాడు ఆశగా. అప్పటికి చాలాసార్లు తుషార్ తను వెబ్‌కా

### అతి చిన్న డిటెక్టివ్ కథ

''ఆఖరికి డిఎన్ఎ టెస్ట్‌లో అంతా తేలిపోయింది''

''ఛ''

మెరా ఆన్‌చేసి పెట్టాడు. అందుకని ఇతని ముఖం ఆమెకు తెలుసు. కానీ రాణి ఇంతవరకూ తన ముఖం చూపించలేదు. వెంటనే వచ్చిన ఆమె సమాదానానికి ఆశ్చర్యపోవటం తుషార్ వంతయింది. అతను అడగటం కోసమే కాచుకున్న దానిలా.. ''ఓ... షూర్. వచ్చే మంగళవారం మూడు గంటలకు మా ఆఫీసు ఎక్కడుందో చెప్పానుగా? దానికి ఎదురుగా ఉన్న 'మాల్'లో ఉన్న 'బరిస్తా' కాఫీ దగ్గర కలుద్దాం. ఓకే?'' అని ఆమె అడుగుతుంటే అతనింకేం ఆలోచించకుండా సరే అన్నాడు.

ఈ రోజే మంగళవారం. మధ్యాహ్నం అర్ధరోజు సెలవు పెట్టేసి భోంచేసి బైకులో బయలుదేరాడు. 'బరిస్తా' కాలేజీ విద్యార్థుల వయసున్న యువతీ యువకులతో నిండి ఉంది. 'ఈ సమయంలో కాలేజీలో ఉండకుండా వీళ్ళేం చేస్తున్నారో ఇక్కడ' అనుకున్నాడు. మళ్ళీ తనలో తనే తను మాస్టరు అన్న విషయం తన 'గర్ల్ ఫ్రెండు'ను మొదటిసారి కలుస్తున్నప్పుడయినా మరచిపోవాలి అనుకుని తలమీద కొట్టుకున్నాడు.


రెండున్నర అయినప్పుడే వచ్చి మూడున్నర అయినా రాణి రాక పోయేసరికి, బావుండదని, బోరు కొట్టి, ఏం కాఫీ రకాలున్నాయో చూద్దామని కౌంటర్ గద్దరికి వెళ్ళాడు. కాఫీలు కలిపి అందించే మనిషి ఎస్ప్రెస్సో, కపూచినో, కాఫీ లాటె, హేజల్‌నట్ మోచా, అని పేర్ల రీలు వదుల్తుంటే, అతనికి నక్షత్రాలు కనిపించినట్లయింది. ఎలాగో కోలుకుని ఒక ఎస్ప్రెస్సో తీసుకుని వచ్చి కూర్చుని తలుపు వైపే చూడసాగాడు. ఇంకొక గంట నిరీక్షణ, ఒక 'మోచా' అయిన తర్వాత, ఇంకా ఉండటంలో అర్థం కనిపించలేదతనికి. లేచి ఇంటికి బయలుదేరాడు.

ఇల్లు చేరగానే కంప్యూటర్ దగ్గరికెళ్ళి చూద్దామంటే గంగ రాకవల్ల ఆలస్యం అయిపోయింది. ఆలోచనల నుంచీ బయటపడి వాచీలో టైము చూసుకున్నాడు. ఎనిమిది గంటలయింది. మమ్మీ భోజనానికి రమ్మని పిలిచేలోపల గౌతం ఏం చేస్తున్నాడో చూద్దామని అనుకుని కంప్యూటరు ఆఫ్ చేద్దామని అనుకుంటుండగా, రాణి ఆన్‌లైన్ కనిపించింది. వెంటనే సంభాషణ మొదలు పెట్టింది. ''హెలో తుషార్, ఎలా ఉన్నారు?'' అని అసలేమీ జరగనట్లు, తుషార్‌కు మర్చిపోయిందా ఏమిటి అని ఆశ్చర్యమయింది. అందుకని తనే అడిగాడు. ''మధ్యాహ్నం బరిస్తాకు రాలేదేం?'' అని.

పెద్దగా నవ్వుతున్న ముఖం చిహ్నమొకటి వేసి, ''మీ ఇంటికే వచ్చి మాట్లాడదామంటే తప్పించుకున్నారేం?'' అని మాట మార్చింది. అతని ప్రశ్నకు జవాబివ్వకుండా. ''నిజంగా? మా ఇంటికి మీరెప్పుడొచ్చారు?'' అని అర్థంకానట్లు అడిగాడు, మనసులో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ.

ఇంతలో తన కంప్యూటరు వెబ్‌కామెరా ఆన్ చేసిందేమో, పైన చిన్న 'విండో'లో కనిపించింది, సాయంత్రం తమ ఇంటికొచ్చిన గంగ ముఖం! ఇదే మొదలు ఆమె కామెరా ఆన్‌చేసి ముఖం చూపించడం! పూర్తిగా షాక్ అయిపోయిన తుషార్‌కు ఎలా స్పందించాలో కూడా అర్థం కాలేదు. కానీ ఏమీ జరగనట్లు గంగే మొదలుపెట్టింది, టైప్ చెయ్యటం.

''హౌవాస్ యువర్ డే? ఇవాళ ఎలా గడి



చింది. మీ క్లాసును శాంతంగా జరగనిచ్చేరా మీ విద్యార్థులు?''

''ఓ! మామూలే! అన్నీ త్వరగా అర్థం చేసుకుని చెప్పిందే చెప్తే బోర్‌కొట్టే వాళ్ళు, పది సార్లు చెప్పినా అర్థం చేసుకోలేని దద్దమ్మలు సమానంగా ఉంటారు. మన సమస్యేమిటంటే అందరికీ న్యాయం చెయ్యగలగటం! హౌ అబౌట్ యూ?''

''నాది మామూలే, ఈరోజే మా బాస్ యు.ఎస్ ట్రిప్ నుంచీ తిరిగొచ్చాడు. పదకొండింటికే ఆఫ్ తీసుకుని ఇల్లు మార్చుకుందామంటే, కొద్దిగా సతాయించాడు. ఐడిడ్ నాట్ కేర్! ఏమయినా చేసుకోనీ అని వచ్చేశాను''.

కొన్ని రోజులుగా ఒకటిరెండు సార్లు చెప్పింది. ఇల్లు మార్చాలని చూస్తున్నట్లు. కానీ తుషార్ వాళ్ళ ఇల్లున్న ప్రాంతంలో తను చూస్తున్నట్లు గానీ, అతన్ని చూడమని గానీ చెప్పలేదామె. ''బహుశా తన్ని 'సర్‌ప్రైస్' చెయ్యాలని అనుకుని ఉంటుంది'' అనుకున్నాడు తుషార్. ఆమె మాటల్లో ఆ చిలిపితనాన్ని చూశాడతను.

ఇద్దరూ కాస్సేపు కబుర్ల కాలక్షేపం కానిచ్చాక ఆ వారాంతంలో ఇద్దరూ కొత్తగా వచ్చిన ఇంగ్లీష్ సినిమా ఒకదానికి వెళ్దామని తుషార్ ప్రతిపాదించాడు. ఆశ్చర్యంగా ఇతడు అనుకున్నంతకన్నా సులభంగా అంగీకరించింది, గంగ (రాణి!)



***

పక్క ఇంట్లో చేరిన మూడు నెలల్లోపల గంగ తుషార్ కన్న అతని తమ్ముడికీ, తల్లికీ ఎక్కువ దగ్గరయింది. గౌతంకు గంగ దగ్గర ఎంత చనువు ఎక్కువయిందంటే, అన్నయ్య ఇంట్లో ఉన్నా తనకు చదువులో సహాయం కావాలంటే, గంగ ఆఫీసునుంచీ వచ్చేదాకా కాచుకుని ఆమెతోనే సహాయం తీసుకుంటాడు. జానకమ్మ ఇంట్లో ఏ కొత్తగానో, ప్రత్యేకంగానో చేసిన వంట గంగ రుచి చూసి బాగుందంటేనే తృప్తి పడుతుంది. వారంలో నాలుగు సార్లయినా ఆమె వీళ్ళింట్లో రాత్రిళ్ళు భోజనం చెయ్యవలసిందే.

గంగతో రాణిగా మొదట చాటింగ్‌లో మాత్రమే పరిచయమయినప్పుడు తుషార్‌కు కొంచెం సంకోచంగా ఉండేది. ఈ అమ్మాయితో పరిచయం ప్రేమగా మారితే, అమ్మకెలా చెప్పటం అని, ఇప్పటి పరిస్థితి చూస్తుంటే, అదేదో సులభమయ్యేటట్లే కనిపించింది. ఆవిడ అంత పాతకాలం మనిషేం కాకున్నా, అనాథ అంటే అంగీకరిస్తుందా అని భయం! కానీ అతను కలలో కూడా ఊహించనిదే జరిగింది!

తుషార్ స్కూల్లో అతని క్లాసులో ప్రతీ నెలా చివర్లో ఒక ఎసైన్‌మెంటూ ఇస్తాడు. అవన్నీ మొదటి వారం లోపల పరిశీలించి మార్కులిచ్చి తిరిగిచ్చెయ్యాలి. ఆరోజు రాత్రి భోజనమయాక, తుషార్ అమ్మదగ్గర కూర్చుని కబుర్లు చెప్తూ టీవీ చూడకుండా తన గదిలో పేపర్లు దిద్దుతూ కూర్చున్నాడు. జానకమ్మ అతని గదిలోకి వచ్చింది. తుషార్ ఆశ్చర్యంగా చూస్తూ పేపర్లలోంచి తల పైకెత్తి, ''ఏమ్మమ్మీ ఏదయినా మాట్లాడాలా?'' అని అడిగాడు. ఆమె గౌతంకు తెలియకుండా ఇతనికేదయినా చెప్పాలంటే, అలా అతని గదికి వస్తుంది.

జానకమ్మ ఒక సంవత్సరంగా తుషార్‌కు పెళ్ళి చెయ్యాలని సంబంధాలు చూస్తోంది. ఈ మధ్యలో చూసిన మూడూ తుషార్‌కు నచ్చలేదు. అతని 'విష్-లిస్ట్' కాస్త పెద్దదే! ఎక్కువ మాడర్న్ అమ్మాయి వద్దు. డిగ్రీ అయినా చదివి నలుగురితో మాట్లాడగలిగేలా ఉండాలి. కానీ అతిగా పార్టీలు, క్లబ్బులు అని తిరిగే వాళ్ళు వద్దు. అందంగా ఉండాలి. సింపుల్‌గా ఉన్నా, డ్రస్సులో స్టైల్లో అభిరుచి ఉండాలి. అన్నిటికన్న ముఖ్యంగా అమ్మను గౌరవించాలి. గౌతంను ఇష్టంగా చూసుకోవాలి. నిజానికి జానకమ్మకూ ఇవన్నీ కాస్త ఎక్కువే అనిపించినా పైకేమీ అనదు, కొడుకును నొప్పించడం ఇష్టం లేక!

తన మనసులో ఉన్న ప్రస్తావన బైట పెట్టింది. ''గంగ మంచిపిల్ల కదరా తుషార్?'' ''ఊ...'' అన్నాడు తుషార్ పేపర్లోంచి తల పైకెత్తి, పెన్ను మూసేసి పక్కన పెడుతూ ''అందంగా బొమ్మలా ఉంటుంది. నాకు అమ్మాయిలు లేనిలోటు తీరుస్తోంది. నువ్వు తన్ను పెళ్ళి చేసుకుంటే బాగుంటుంది''.

సంభ్రమంగా అడిగాడు తుషార్, ''ఎక్కడి నుంచీ వచ్చిందీ ఐడియా?'' అని అడిగాడు.

''మీ ఇద్దర్నీ చూసి నేనే అనుకున్నాను. నీ మనసులో నీకాబోయే భార్య ఎలా ఉండాలో అన్న నీ ఆశలకు కూడా సరిపోతుంది. చక్కగాఉంది. కలుపుగోలుగా నేనంటే ప్రేమగా ఉంటుంది. నిజానికి మనింట్లో బాగా కలిసిపోయింది. ఆ అన్నట్లు



# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

## చేదు విషం

దేశ కాలాలకు అతీతంగా, వ్యక్తుల అజ్ఞానం, బలహీనతలే పణంగా, అనాదిగా కొన సాగుతున్నది జూదం.

ఒక వూళ్లో చేదు కషాయం తాగే పోటీ పెట్టాడో కిలాడీ. ఇష్టంగా, ముఖకవళికలు ఏ మాత్రం మార్చకుండా, ఒక జగ్గునిండా వున్న కషాయం ఒక్క గుక్కలో లాగెయ్యాలి. అలా చెయ్యగలిగితే, బహుమతి వెయ్యి రూపాయలు - తాగలేని వాళ్లంతా కలిసి తాగ గలిగిన వాళ్ల కివ్వాలి.

గుమిగూడిన జనమంతా కషాయం రుచి చూశారు. నాలికకు తగిల్తేనే డోకొచ్చేటంత చేదుగా, వెగటుగా వుందా ద్రావకం. అక్కడున్న వాళ్లందర్లోకీ చిన్నవాడూ, అమాయకుడిగా కనిపిస్తున్న స్కూలు కుర్రాడొకడు ముందుకొచ్చి ''నేను తాగుతా''నన్నాడు. అందరూ ఆశ్చర్యంగా చూశారు. పసి పిల్లాడు. చచ్చిపోతాడని గగ్గోలు పెట్టారు. ''సాహసం శాయరా, డింభకా'' అన్నాడు కిలాడీ.

జనమంతా గుమిగూడటంతో ఓ అయిస్ ఫ్రూట్‌ల బండీ వచ్చి నిలిచిందక్కడ. కుర్రాడు గబగబా నాలుగైదు అయిస్ ఫ్రూట్లు, మరిన్ని అయిస్ ముక్కలు గబగబా నమిలి మింగి, గరళ కంఠుడిలా కషాయాన్ని గటగటా తాగేశాడు.

ఎలా తాగ గలిగాడంటారు?

సమాధానం: ఐస్‌ఫ్రూట్లూ, ఐస్ ముక్కలూ తినటం వల్ల, నాలుకా, గొంతులోని ''రుచి గ్రంథులు'' తాత్కాలికంగా మొద్దుబారి స్పర్శా జ్ఞానం కోల్పోతాయి. కొద్ది సెకండ్ల మాత్రమే వుండే అనెస్థీషియా లాంటి స్థితి అది.

గౌతంకు కూడా తనంటే చాలా ఇష్టం!''

రోగి కోరిందీ వైద్యుడు చెయ్యమని చెప్పిన పథ్యం ఒకటే అయినప్పుడు ఇక సమస్యేముంది? కొడుకు ఆ అమ్మాయిని కూడా అడిగి చూడు అని అనకపోవడం జానకమ్మ గమనించింది. అంటే, తను అనుకున్నట్లే, ఈ మధ్యలో కొడుకు కొన్నిసార్లు రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చి కారణం చెప్పని రోజు గంగతో తిరుగుతున్నాడన్న మాట. ఆ అమ్మాయిని తుషార్ ఇష్టపడిన విషయం ఆవిడకు చూచాయగా తెలుసు.

తరువాత అన్నీ చకచకా జరిగి పొయ్యాయి. గంగకు బంధువులంటూ ఎవరూ రారు కాబట్టి తిరుపతికి వెళ్ళి చేసుకుంటే బాగుంటుంది అని జానకమ్మ సలహా. తుషార్ మాత్రం గంగ పుట్టి పెరిగిన అనాథ శరణాలయంలో అనుకూలముంటే అక్కడ చేసుకుంటే బాగుంటుంది అనుకున్నాడు. ఆ విషయం ఇంట్లో కూర్చుని అందరూ చర్చించాక చివరికి తిరుపతే బాగుంటుందని అనుకున్నారు. తుషార్ వైపు దగ్గరి బంధువులు స్నేహితులు రావాలన్నా తిరుపతి అయితే అందరికీ అనుకూలంగా ఉంటుందని గంగే సలహా ఇచ్చింది. జానకమ్మ దగ్గర్లో ఉన్న మంచి ముహూర్తాలు చూద్దామను కునే లోపల, గంగ ఆఫీసు ఎసైన్‌మెంట్ మీద, అమెరికాకు మూడు నెలలు వెళ్ళాలిసొచ్చింది. పెళ్ళి మూడు నెలల వెనక్కు పడింది.

***

గంగ అమెరికాకు వెళ్ళినప్పటినుంచీ తప్పకుండా తుషార్‌కు వారానికొక ఇ మెయిల్ పంపిస్తోంది. తను తిరిగొచ్చే సమయం దగ్గర పడుతుంటే ఉత్సాహంగా ఉంది తుషార్‌కు. జానకమ్మ కూడా బాగా మిస్ అయ్యింది గంగను. ఆ రోజు గురువారం. ఆదివారం అర్ధరాత్రి గంగ తిరిగొస్తుంది. తుషార్ విమానాశ్రయానికి వెళ్ళాలని అనుకున్నాడు. గంగే వద్దంది. తన వెంట తన సహోద్యోగులు, మేనేజరు కూడా ఉంటారని, అందరికీ కలిపి డ్రాప్ ఉంటుందని చెప్పింది. అయినా తను అక్కడికి వెళ్తే సమస్యేమిటో అర్థం కాకున్నా గుచ్చి అడగడం ఇష్టం లేక ఊరుకుండి పొయ్యాడు.

పడుకునే ముందు ఆ రోజే వచ్చిన గంగ మెయిల్ మరోసారి చదువుతూ కూర్చున్నాడు. ఆమె తనతో ఎదురుగా ఉన్నప్పుడు కానీ, ఫోన్లో కానీ మాట్లాడటం కన్నా ఉత్తరాల్లో చాలా ఆవేశం, మనసు విప్పి చెప్పటం అతనికి కనిపిస్తుంది. అతనికి మళ్ళీ చదవాలని అనిపిస్తుంది.

''డియర్ తుషార్,

హౌ ఆర్ యూ? అమ్మ, గౌతం బాగున్నారా? మూడు నెలలకే నాకు మిమ్మల్నందర్నీ చూసి ఎన్నో రోజులయినట్లుంది. వచ్చే రోజు దగ్గర పడుతుంటే మరీ ఆత్రుతగా అనిపిస్తోంది. మన పెళ్ళి ఇంత దగ్గరికి వచ్చాక నేను ఇలా విదేశాలకు వెళ్ళవలసి రావటం చాలా దురదృష్టం! ఏం చెయ్యను? నా ఉద్యోగంలో ఇవి తప్పవు. వచ్చిన అవకాశాలు పోగొట్టుకుంటే అమ్మాయిలను 'కెరీర్'లో పెరగనివ్వరు.

ప్రతీ వీకెండ్ ఏదో ఒక చోటికి బయటికి వెళ్ళి విసుగొచ్చేసింది నాకు. గదిలోనే విశ్రాంతిగా ఉండిపోయాను. పడుకుని నీ ఫొటో వైపు చూస్తూ నా అదృష్టాన్ని గురించీ ఆలోచిస్తూ ఆదివారం మధ్యాహ్నం అంతా గడిపాను. చిన్నప్పటి నుంచీ కుటుంబం లేకుండా పెరిగినందుకేమో నిన్ను కలిసేవరకూ నాకు ప్రేమంటే ఏమిటో తెలీదు. మీ ఇంటికి దగ్గర్లో వచ్చి చేరటం నేను చేసిన చాలా మంచిపని. 'ఐ ఫెల్ ఇన్ లవ్ విత్ ఆంటీ అండ్ గౌతం ఫస్ట్!' తరువాత నువ్వు! ఆవిడను మొదటిసారి కలిసినప్పుడు, ఆమె నన్ను అంత సులభంగా మీలో చేర్చుకుంటారని అనుకోలేదు''.

చదవటం ఆపి నవ్వుకున్నాడు తుషార్. గంగ గురించి జానకమ్మ స్పందన తుషార్‌కు ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంటుంది. గంగ ఏం మాయ చేసిందో? ఆవిడ దగ్గరి బంధువుల అభిప్రాయాలకు ఎంత విలువ ఇస్తుందో తనకు తెలుసు! అలాంటిది గంగ విషయంలో.....

''మీరు టీచర్ అని నాకు చెప్పటానికి కొంచెం సంకోచించారు కదూ? చాటింగ్‌లో పరిచయమయిన ఈ మాడరన్ అమ్మాయి ఉపాధ్యాయుణ్ణి అని చెప్పుకుంటే విలువిస్తుందో లేదో అనుకున్నారా? ఏమనుకున్నా నాకు మాత్రం మీ గురించి ఆలస్యం చేసినా నిజాలే చెప్పారు. నా కాబోయే భర్త శ్రీరామచంద్రుడంత సత్యవంతుడని అనుకుంటే గర్వంగా ఉంటుంది. అయినా నాకూ తెలుసు సర్! ఇది కంప్యూటర్ యుగం! పబ్లిక్ స్కూలు టీచర్లు కంప్యూటర్ 'సావీ' కాకపోతే మీ విద్యార్థులే మిమ్మల్ని ఆట పట్టిస్తారని.

''ఇక్కడ ఆఫీసులో వచ్చేది ఆఖరు వారం కాబట్టి వచ్చిన పనులన్నీ ముగించటంలో బాగా బిజీ అయ్యాము. సగం రోజు రివ్యూ మీటింగుల్లో గడిచిపోతుంది. ఆ రోజు చెయ్యవలసిన పని ముగించే లోపల రాత్రి ఏ పది గంటలో అవుతుంది చాలా రోజులు. అంత రాత్రి ఇక్కడ ఆఫీసులో ఉన్నది మేమే. అమెరికన్స్ ఎవరూ ఉండరు. వాళ్ళు టైంకి సరిగ్గా తమ పనులు ముగించుకుని వెళ్ళిపోతారు. శుక్రవారాలయితే, ఇక మధ్యాహ్నం నుంచే 'వీకెండ్ ఔటింగ్స్ చాలాదూరాలు వెళ్ళిపోవటానికి సన్నాహాలు మొదలవుతాయి. ఈ ప్రాంతంలో చెరువులు చాలా ఉన్నాయి. కొంత మంది చిన్న పడవలను వాళ్ళ కార్ల కప్పుల మీద కట్టేసుకుని ఉంటారు ఉదయమే!

''అన్నట్లు మీకు గుర్తుంది కదూ? గురువారం మా ఫ్లైటు. ఆదివారం ఉదయం మీ ముందుంటాను''

తుషార్ ఆ విషయాన్ని ఎలా మరచిపోగలడు? అనాలోచితంగా, గంగ ఉత్తరం ముగించిన సంతకం కనిపించాక కూడా కిందికి స్క్రోల్ చేసాడు. అక్కడ ఏవో అర్థం కాని ఇంగ్లీషు అక్షరాలు కనిపించాయి. **XKIX EJ YOPWZEQI LWNWZACNKQJZ AWH YKILKQJZ KJ 815** ఆశ్చర్యంగా చూస్తూ చదవటానికి ప్రయత్నించాడు! ఊహూ. ఏమీ అర్థం కాలేదు. ఇంక ఏమయినా కనిపిస్తుందేమోనని కిందికి స్క్రోల్ చేసి చూసాడు. 'సెంట్ ఫ్రమ్ బ్లాక్‌బెరీ' అని మాత్రం ఉంది. గంగ దగ్గర బ్లాక్‌బెరీ ఉందని తుషార్‌కు తెలీదు. ''ఎప్పుడు కొనుక్కుందో నాకు చెప్పలేదే?'' అనుకున్నాడు. అయినా అనుమానం ఎందుకు? ఎవరిదయినా స్నేహితులది ఉండొచ్చు కదా అని సరిపుచ్చుకున్నాడు. కానీ ఎవరి బ్లాక్‌బెరీలో వాళ్ళ మెయిల్‌బాక్స్‌ను 'కాన్ఫిగర్' చేసుంటారని అతనికి తెలుసు.

కంప్యూటర్ ఆఫ్ చేసి ఆలోచనలు అనుమానాలతోనే పడుకుని నిద్ర పోవటానికి ప్రయత్నించాడు. పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్న తర్వాత తన మనసుకు ఆమె చాలా దగ్గరయింది. మరి తనో? ఆమె గురించి తనకు అన్ని విషయాలు తెలిసినా ఇంకా ఏదో ఉందేమో తనకు తెలియనిది, అనిపిస్తుంది. కొద్దిగా కళ్ళు మూతలు పడినప్పుడు కళ్ళ ముందు, మెయిల్‌లో చూసిన అర్థం కాని అక్ష

రాలు కదులుతున్నాయి.

హఠాత్తుగా ఏదో గుర్తొచ్చింది. లేచి కంప్యూటర్ ఆన్ చేసి లాగిన్ చేశాడు. XKIX EJ YOPWZEQI LWNWZACNKQJZ AWH YKILKQJZ KJ 815 అంటే ఏంటో అర్థం కాలేదు. తను కంప్యూటర్ ప్రోగ్రామ్ కోడ్ చూసాడు. ఇలా ఉండదు. గంగ చాటింగ్‌లో వస్తుందేమోనని చూశాడు, ఆమెనే అడగొచ్చు దీని అర్థమేంటని, గంగ కనిపించలేదు. తను విదేశాలకు వెళ్ళినప్పట్నుంచీ చాలా బిజీ! చాటింగ్ చెయ్యదు.

ఇంకేవో జ్ఞాపకాలు. గంగ అమెరికాకు వెళ్ళగానే పంపిన మొదటి మెయిల్ అంతా తమ ప్రయాణ అనుభవాలు. రెండు ఫ్లైట్లు మిస్ అవడం, సింగపూరు విమానాశ్రయంలో రాత్రంతా గడపవలసి రావడం, అన్నీ వివరంగా వ్రాసింది. అంతా చివరిదాకా గమనించి చూశాడు. అదికూడా బ్లాక్ బెరీ నుంచే వచ్చింది. కానీ అందులో వేరే అక్షరాలేమీ లేవు. వారం రోజుల తరువాత వచ్చిన రెండో మెయిలు, రెండో వారంలో వచ్చిన మూడోది తెరిచి చదివాడు. ఆ వారాంతం తాము 'యెల్లో స్టోన్ నేషనల్ పార్కు' చూసి వచ్చిన వివరాలు వ్రాసింది. అందులో కనిపించాయి. ఇంకొక సెట్ అక్షరాలు. IAAP SAOPAJZ CANZAJ WP 0200 KJ 614 మళ్ళీ అర్థం కాలేదు. ఏమయ్యింటుందా అని ఆలోచిస్తూనే, తరువాత వచ్చిన మెయిల్స్ అన్నీ ఓపెన్ చేస్తూ పోయాడు. రెండు వారాల క్రితం వచ్చిన ఒక మెయిలు చివర్లో మళ్ళీ అక్షరాలు! XKIE EJ EOGKJ PAILHA KJ 715.

ఒక్కొక్కటే చూస్తున్న కొద్దీ అతన్లో అనుమానం హెచ్చుతోంది. గంగనే అడుగుదామా అనిపించి ఫోన్ చేతికి తీసుకున్నాడు. అప్పటికి టైం రాత్రి మూడు గంటలు. శబ్దం వినిపిస్తే వాళ్ళమ్మ నిద్రా భంగం అయి లేచి వస్తుంది. ఉదయం చూసుకోవచ్చులే అనుకున్నాడు. 715 అంటే జులై పదహైదో తేదీనా? అయితే ఆరోజేమయింది? మొదటిదాని చివర 615 అని ఉంది. జూన్ పదహైదో తేదీనా? తుషార్‌కు ఆ అక్షరాలు అక్కడేం చేస్తున్నాయి అన్న దానికన్నా, వాటికి అర్థం ఏమిటి, దాని ద్వారా ఏమని మెసేజ్ వెళ్తోంది? ఎవరికి? అన్న ప్రశ్నలే ఎక్కువ బాధిస్తున్నాయి.

ఇవే ఆలోచనలు అనుమానాలు అతని మనసును తొలిచేస్తుంటే, అలాగే తయారయి ఉదయం స్కూలుకు వెళ్ళిపోయాడు. స్కూల్లో తమ డిపార్ట్‌మెంట్‌లో నెల రోజులయింది ఒక కొత్త మాస్టరు సుజేష్ త్రివేది అనే అతనుచేరాడు. లోపల అడుగుపెట్టి తన క్లాసుకు వెళ్ళే లోపల, సుజేష్ ఎదురొచ్చి "గుడ్ మార్నింగ్" అన్నాడు. అప్పుడు గుర్తొచ్చింది. అతనికి నంబర్లు, అక్షరాలు వాటితో కోడ్ తయారు చెయ్యటం హాబీ. తనను అర్థం కాకుండా సతాయిస్తున్న మెసేజ్‌ను ఇతనికి చూపిస్తే అనుకున్నాడు. ఇంటర్వెల్‌లో ఫ్రీగా ఉన్నప్పుడు, డిపార్ట్‌మెంట్‌లో ఉన్న కంప్యూటర్‌లో తన మెయిల్ తెరిచి, మూడు మెయిల్స్‌లో ఉన్న వాక్యాలను ఒక చోట చేర్చి, వాటిని మాత్రమే, సుజేషకు చూపించాడు.

సుజేష్ కొంచంసేపు ఆ వాక్యాలనే పరీక్షించి చూసి, "నాక్కొద్దిగా టైమివ్వండి తుషార్! రేపు చెప్తాను" అని పేపరు జేబులో పెట్టుకున్నాడు. కానీ తుషార్ ముఖంలో కనిపించిన నిరుత్సాహాన్ని గమనించి, "అర్జెంట్ అయితే ఒక పని చెయ్యండి. ఇదొక సింపుల్ కోడ్ అయితే, ఇంగ్లిష్ అక్షరమాలలో అక్షరాలను ఒకచోటు పక్కకు జరిపి ఈ అక్షరాలకు మాచ్ చేసి చూడండి. సరిపోక పోతే మరొక అక్షరం కుడిపక్కకు జరిపి చూడండి. ఇలా ప్రయత్నిస్తూ పోతే అర్థం దొరకొచ్చు. అలా కాక ఇంకేదయినా పద్ధతిలో ఉపయోగించిన కోడ్ అయితే, మీ బాడ్‌లక్. రేపటి దాకా వేచి ఉండాలి!" అని తన క్లాసుకు వెళ్ళిపోయాడు.

రాత్రి భోజనాలయి తన గదిలోకి వెళ్ళిపోయాక సుజేష్ చెప్పినట్లు ప్రయత్నించాడు.

ABCD EFGH IJKL MNOP QRST UVWXYZ

ZABC DEFG HIJK LMNO PQRS TUV WXY

ఇలా వేసి A=Z, B=A, C=B అని జత చేసి అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడు.

ABCD EFGH IJKL MNOP QRST UVWXYZ

YZAB CDEF GHIJ KLMN OPQR STU VWX

A=Y, B=Z, C=A ఇలా జతచేసి చూసాడు. ప్రయోజనం లేకపోయింది.

ఈ సారి మూడు స్థలాలు, నాలుగూ జరిపి ఒకే సారి వ్రాసి చూసుకున్నాడు.

ABCD EFGH IJKL MNOP QRST UVW XYZ
XYZA BCDE FGHI JKLM NOPQ RST UVW
WXYZ ABCD EFGH IJKL MNOP QRST TUV

నాలుగో వరుస క్రమంలో రెండో సూచన అర్థమయి కళ్ళు తిరిగిపొయ్యాయి. తుషార్‌కు.

XKIX EJ EOGKJ PAILHA KJ 715

BOMB IN ISCON TEMPLE ON 715

715 అంటే, జులై నెల పదహైదేనా? ఈ రోజు ఆగస్టు పది. గత మాసం ఒక రోజు సాయంత్రం, ఇస్కాన్ ఆలయంలో ఎవరూ జనం లేని చోట చిన్న సైజు బాంబొకటి పేలిందన్న విషయం గుర్తొచ్చింది. ఇంట్లో న్యూస్‌పేపర్లు పెట్టే చోటుకు వెళ్ళి, జులై 16 పేపరు తీసి ఆ వార్తకోసం వెతికాడు. చదివిందాన్ని బట్టి పేలింది అంత పెద్ద బాంబేం కాదనీ, దానివల్ల ఎక్కువగా నష్టమేం జరగలేదనీ, పేలిన ఇరవయినాలుగ్గంటలయినా ఎవరూ మేం చేసామని ప్రకటించినందుకు, ఇదెవరో ఉగ్రవాదులు చేసిన పని కాకపోవచ్చనీ పోలీసుల అభిప్రాయం అనీ వ్రాసారు పేపర్లో.

మొదటి, మూడో సూచనలను కూడా వ్రాసి చూసుకున్నాడు.

IAAP SAOPAJZ CANZAJ WP 0200 KJ615

MEET WESTEND GARDEN AT 0200 ON 615

XKIX EJ YOPWZEQI LWNWZAC-NKQJZAWH YKILKQJZ KJ 815

BOMBS IN CSTADIUM PARADE-GROUND HAL COMPOUND ON 815

ఇంతచూసాక కూడా ఊరికే ఉండలేక పొయ్యాడు తుషార్. ఏం చెయ్యాలో తోచక, వెళ్ళి అప్పుడే గురకపెట్టి నిద్రపోతున్న జానకమ్మను లేపి తీసుకొచ్చాడు. క్లుప్తంగా వివరాలు చెప్పి కంప్యూటర్ మీద ఉన్న వాక్యాలు చూపించాడామెకు. అక్కడ కనిపిస్తున్న అర్థం అతని మనసును కలచివేస్తున్న, అవి తనుప్రాణంగా ప్రేమించే గంగ మెయిల్స్‌లో ఉన్నాయంటే నమ్మలేకుండా ఉన్నాడు. అతన్నీ క్రియాశూన్యత నుంచీ జానకమ్మే బయట పడేసింది. "వెంటనే పోలీసులకు తెలియ జెయ్యాలి నాన్నా ఈ విషయం!"

ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట, హైదరాబాద్. 500 073.
ఫోన్: 040 - 23747777, 9391999999

FREE online Registration & Free search

www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com


అమీర్‌పేట, కూకట్‌పల్లి, దిల్‌షుఖ్‌నగర్, విజయవాడ, గుంటూరు, తెనాలి, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, ఖమ్మం, ఒంగోలు
నెల్లూరు, తిరుపతి, కర్నూలు, (చెన్నయ్) టి.నగర్, బెంగుళూర్, సేలం, మధురై, వెల్లూరు, తిరుచి, పాండిచ్చేరి, ఈరోడ్, ఏలూరు
చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.

''పోలీసులకా?'' ఎక్కడ మొదలు పెట్టాలో తెలియని వాడిలా అయోమయంగా అడిగాడు.

''మీ చిన్నాన్నా వాళ్ళకు పోలీసు ఆఫీసర్ చంద్రకాంత్ మంచి స్నేహితులు కదా? మొదట చిన్నాన్నకు ఫోన్ చెయి'' అని పురమాయించింది. తుషార్ ఫోన్ చేతికి తీసుకున్నాడు. తరువాత అన్నీ చకచకా జరిగి పొయ్యాయి. ఆ రోజు ఆ ఇంట్లో ఏ రాత్రి మూడు గంటలకో, ఇంటికొచ్చిన చిన్న పోలీసు సిబ్బంది వెళ్ళిపోయేవరకూ దీపాలు ఆరలేదు. పెద్ద గోలగా లేనందుకు గాఢ నిద్రలో ఉన్న గౌతంకు ఉదయం లేచేదాకా విషయం తెలియలేదు.

రాత్రి ఫోన్ చేసాక వచ్చిన సైబర్ క్రైం సెక్షన్ పోలీసు సిబ్బంది తుషార్ కంప్యూటర్ మొత్తాన్ని గాలించి చూసారు. చివరికి తెలిసింది గంగ నుంచీ తుషార్‌కు వచ్చిన కోడ్ ఉన్న మెయిల్సు ఇంకా నలుగురికీ వెళ్లినట్లు, ఆ మెయిల్ చిరునామాలు ఇతనిక్కనిపించకుండా జాగ్రత్త తీసుకున్నట్లు. అంటే భయోత్పాదకులు తమ మధ్య సందేశాలను పంపించుకోవడానికి తన మెయిల్‌ను ఉపయోగించుకున్నారన్న మాట! తమ ఇద్దరి మధ్య జరిగే సంభాషణల్లోకి ఇతరులెవరో ప్రవేశించ గలిగారంటే! ఇందులో గంగ చెయ్యి ఉందా? ఆమె అమాయకురాలా? వంచించబడిందా? జానకమ్మకూ అలాగే అనిపించింది. తుషార్ కంప్యూటర్ మీద పని చేస్తున్న పోలీసులకు కాఫీ తెచ్చిపెట్టిన ఆవిడ అన్నది, ''గంగకు ఫోన్ చేసి ఇదంతా ఏమిటని అడగొచ్చుగా?'' అని. ఆమె మాటలు విన్న ఇన్స్‌పెక్టర్ అన్నాడు. ''సార్! ఆ పని చేసేరు! జాగ్రత్త! ఆమె ఈ గుంపులో ఒకరయితే మనం 'క్లూ' ఇచ్చినట్లవుతుంది''.

తరువాత వచ్చిన వాళ్ళు వెళ్ళేలోపల తెలిసి తుషార్‌ను షాక్‌చేసిన మరో విషయం, మే ఇరవయి తేదీ ఇక్కడ్నుంచీ అమెరికాలో హ్యూస్టన్-టెక్సాస్‌కు నేరుగా కానీ, అంచెలుగా కానీ వెళ్ళిన ఏ విమానంలో గంగ అని పేరున్న వ్యక్తి కాదు కదా, ఆమె కంపెనీ తేజీ టెలికాం నుంచీ కూడా ఎవరి పేర్లూ ప్రయాణీకుల లిస్టులలో లేవు.

***

ఆదివారం ఉదయం ఆరు గంటల సమయం! తన ఇంటి ముందు టాక్సీ దిగి, అంతర్జాతీయ ప్రయాణాల్లో ఉపయోగించే పెద్ద సూట్‌కేసును సునాయాసంగా చక్రాల మీద లాగుతూ లోపలి కెళ్ళింది. తలుపు తాళం తీయబోతే రాలేదు. తను తుషార్ వాళ్ళకు తాళం ఇచ్చి వచ్చినా అతనికేం పని తన ఇంట్లో? ఆశ్చర్యంగా తలుపుతోసి చూసింది. లోపల ఒక పెద్దగుంపును చూసి ఆశ్చ ర్యంగా నిలుచుండిపోయింది. నలుగురు పోలీసులు, ఒక ఇన్‌స్పెక్టర్. వాళ్ళతోబాటు తుషార్ కూడా అక్కడే ఉన్నాడు.

పరిస్థితి అర్థమయింది గంగకు. భుజానికున్న హాండ్‌బ్యాగు తెరిచింది. అందులోంచి ఏ మారణా యుధమో బయటికి తీస్తుందేమోనని, ఇన్‌స్పెక్టర్ చంద్రకాంత్ తన గన్ చేతికి తీసుకుని ఆమె వైపు గురిపెట్టాడు. అదేం పట్టనట్లు గంగ తాపీగా లోపలి నుంచి తీసిన చిన్న బాక్స్ తెరిచి, అందులో ఉన్న బిళ్ళలు నాలుగూ మింగేసింది. గబుక్కున అక్కడ పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని శూన్యం లోకి చూడసాగింది. ఇటువంటి పరిస్థితుల్లో తమ గుంపును గురించి వివరాలు పోలీసులకు తెలియకుండా జాగ్రత్త పడేందుకు ఉగ్రవాదులు తమ దగ్గర ఎప్పుడూ వెంటనే ప్రాణం తీయగల మందులు ఉంచుతారని తెలుసు. ఆమెను మొదట దగ్గరి ఆసుపత్రికి తీసుకెళ్తే ఉపయోగం ఉండొచ్చని, తన సెల్ ఫోన్లో అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు చంద్రకాంత్.

పోలీసులను చూడగానే ఆమె ముఖంలో వచ్చే మార్పులు చూడాలనే తుషార్ అక్కడున్నాడు. జరుగుతున్నది చూసిన తర్వాత అతని మనసులో ఇంకేం ప్రశ్నలు లేవు. మెల్లగా లేచి బయటికి తమ ఇంటివైపు నడిచాడు. అయిన మోసానికి తల్లికీ, తమ్ముడికీ అయిన షాక్‌నుంచీ వాళ్ళను ఎలా బయట పడెయ్యాలో అతనికా నిముషంలో తెలీదు.

★

చిరునామా: డి.విజయలక్ష్మి
జి-202, మంత్రి టెర్రస్, 1303, బిలేకహల్లి,
బన్నేర్‌ఘట్టరోడ్, బెంగుళూరు - 560 076.
ఫోన్: 09845177368

## కథాకళి

# అసలైన మనిషి

'ఇప్పుడు మీకేం కనిపిస్తోంది?' కిటికీ గుండా పడుతున్న ఎండను చూపిస్తూ అడిగాడు సైన్స్ టీచర్ పదో తరగతి పిల్లల్ని ప్రయోగ శాలలో!

'తెల్లటి కాంతి' బదులిచ్చారు పిల్లలు.

'వెరీ గుడ్!' అంటూ ఒక కాంతికిరణాన్ని అట్ట ముక్కగుండా తెల్లని స్ఫటికంలోకి పంపాడు టీచర్. మరోపక్కన చిన్న తెర ఏర్పాటు చేశాడు.

'తెరపై ఇప్పుడేం కనిపిస్తోంది?' మళ్లీ అడిగాడు టీచర్.

'ఏడు రంగులు!' బదులిచ్చారు పిల్లలు.


సరే. మరో ప్రశ్న. 'మన చుట్టూ ఏముంది?' అడిగాడు టీచర్.

'గాలి...' బదులిచ్చారు పిల్లలు.

'వెరీ గుడ్' అంటూ గాలిలో ఏమేమి వాయువులున్నాయో తెలిపే మీటర్‌ను తెచ్చి చూపించారు టీచర్.

'గాలిలో ఏమేమి ఉన్నాయి?'

'ఆక్సీజన్, కార్బన్‌డై ఆక్సైడ్, నైట్రోజన్ మొదలైన వాయువులు!'



'ఓకే. ఇంకో ప్రశ్న అడుగుతాను. మెరుపు ముందు పుడుతుందా? ఉరుము ముందు ఉరుముతుందా?' అడిగారు టీచర్.

'రెండూ ఒకేసారి..' బదులిచ్చారు పిల్లలు.

'మరి ఏది ముందు మనకు చేరుతుంది?' అడిగాడు టీచర్.

'మెరుపు' చెప్పారు పిల్లలు.

'బావుంది. ఇప్పుడిది చెప్పండి' అంటూ మనుషుల బరువు కొలిచే యంత్రాన్ని తెచ్చాడు టీచర్. దానిపై తన చేతికున్న బంగారు ఉంగరాన్ని ఉంచారు. ముల్లు ఇసుమంతైనా కదల్లేదు.

'ఈ యంత్రం ఆధారంగా నా ఉంగరం బరువెంతో, అది ఎన్ని గ్రాములు తూగుతుందో, దానికి ఎన్ని రూపాలో చెప్పగలరా?' అడిగాడు టీచర్.

'చెప్పలేం' అన్నారు పిల్లలు.

'ఎందుకు? బంగారు ఉంగరానికి బరువులేదా? దానికి విలువ లేదా?'

తెల్లమొహం వేశారు పిల్లలు!

**నీతి:** మన కంటికి ఒకే తెలుపు రంగులో కనిపించే కాంతిలో సప్త వర్ణాలున్నాయి. మన కంటికి అసలే మాత్రం కనిపించని గాలిలో అనేక వాయువులున్నాయి. మెరుపు ముందు మనకు కనిపించినా అది ఉరుముతో పాటూ పుట్టిందే. మన బరువు కొలిచే యంత్రం తూచలేకున్నా బంగారు ఉంగరం విలువైనదే! అంటే ఏమిటి? పేరుకు మనకు జ్ఞానేంద్రియాలు ఉన్నా అవి అన్నిసార్లూ నూటికి నూరుశాతం నిజమైన అవగాహన కల్పించవు. అందువల్ల వాటినే నమ్మి నిర్ణయాలు తీసుకోవడం ఎంతమాత్రం తగదు. పూర్తి సత్యబద్ధమైన అవగాహన కావాలంటే చూపుకు నైపుణ్యాన్ని అందించే స్ఫటికమో, స్పర్శకు లోతుపాతుల్ని పట్టించే వాయు విభాజక పరికరమో కావాలి. అదే సమయంలో ఆ పరికరం సదరు ప్రయోగానికి పూర్తిగా సరిపోయేదై ఉండాలి. బంగారాన్ని తూచాలంటే దాన్ని తూచగల తాసే ఉపయోగించాలి తప్ప మనుషుల బరువు కొలిచే యంత్రం కాదు. మనుషుల జ్ఞానేంద్రియాల పరిమితుల్ని సరిచేసేదే అంతర్‌దృష్టి, వివేకం! ఈ ఆత్మజ్ఞానాన్ని సాధించిన వాడే అసలైన మనిషి!!

**- తిగుళ్ళ కృష్ణమూర్తి**